ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 అనంతపురం జిల్లా వార్తలు

ఆదివారం 2 నవంబరు 2025

రోజూ తనిఖీలే

- పాఠశాలల పనితీరును పరిశీలించాలన్న కమిషనర్
- ఆకస్మికంగా వెళ్లాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు
- మంగళవారం నుంచి అమలు.. డీఈఓ సమీక్ష

(వివరాలు 6వ పేజీలో...)



సీమ అభివృద్ధి మా ఘనత

- వ్యవసాయం, పరిశ్రమలను అభివృద్ధి చేస్తాం
- పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాం
- తప్పుచేసిన వారికి అదే చివరిరోజు
- ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తిని అభివృద్ధి చేస్తాం
- పెద్దన్నవారిపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అందరూ వదిలేస్తే మేం అభివృద్ధి చేశాం.. రక్తం పారించిన చోట నీరు పారిస్తున్నాం



పెద్దన్నవారిపల్లిలో టీడీపీ హయాంలో నిర్మించిన మేడా మల్లయ్య పక్కా ఇంటికి అప్పట్లో ఏర్పాటు చేసిన 'ఎన్టీఆర్ గృహకల్ప' బోర్డును చూస్తున్న సీఎం చంద్రబాబు

పుట్టపర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధి తమ ప్రభుత్వ ఘనత అని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. వ్యవసాయం, పారిశ్రామికంగా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేసి, పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని భరోసా ఇచ్చారు. తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లా అంటే రాళ్లు, ఎండిన చెరువులు, బీళ్లు కనిపించేవని అన్నారు. అలాంటి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామంటే చాలా మంది ఎగతాళి చేశారని, హంద్రీనీవా జలాలతో ఆ మాటలకు నేడు సమాధానం చెప్పామని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని చెరువులకు నీరిచ్చామని, వ్యవసాయ పారిశ్రామిక రంగాలను గణనీయంగా అభివృద్ధి చేశామని అన్నారు. నేడు ఎటుచూసినా పచ్చదనం కనిపిస్తోందని, ఇది టీడీపీ ప్రభుత్వం ఘనత అని అన్నారు. రాయలసీమకు నీరు (మిగతా 6లో...)



పారదర్శకంగా పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ ఆనంద్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారదర్శకంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. మండలంలోని కురుగుంట గ్రామ పంచాయతీ పరిధి ఇందిరమ్మ కాలనీలో శనివారం పలువురు లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్మును ఆయన పంపిణీ చేపట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఎంపీడీఓ దివాకర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, టీడీపీ మండల మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి, టీడీపీ సీనియర్ నాయకులు వెంకటరాముడు పాల్గొన్నారు.

రూ.118.23 కోట్లు పంపిణీ

అనంతపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిరోజు శనివారం 2,65,391 మందికి రూ.118.23 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేశామని డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు. ఆదివారం సెలవురోజు కావడంతో పింఛన్ తీసుకోని వారికి 3వ తేదీన స్థానిక సచివాలయాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

(వివరాలు 7వ పేజీలో...)

నిండుతున్న చెరువు.. మునుగుతున్న చేలు..!

- రాయలచెరువు చెరువుకు చేరుతున్న నీరు
- పంటలు మునక
- పరిహారం ఇవ్వాలని రైతుల డిమాండ్
- అధికారుల నిలదీత



జేఈ నూర్జహాన్‌ను నిలదీస్తున్న పెద్దవడుగూరు మండల రైతులు



పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు వద్ద నీటమునిగిన పంటపొలాలు

యాడికి, పెద్దవడుగూరు, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు లోని చెరువుకు హెచ్చెల్సీ నీటిని మళ్లించడంపై మండలంలోని పలు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజులు నీటి విడుదల కొనసాగితే చెరువు నిండుతుందని సంబరపడుతున్నారు. చెరువు నిండుతుండడంతో పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామ పరిధిలోని ముంపు భూముల్లోకి నీరు చేరుతోంది. దీంతో అరటి, పత్తి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. శనివారానికి 16మంది రైతులకు చెందిన 40ఎకరాల్లోని పంట నీట మునిగినట్లు కిష్టిపాడు గ్రామ రెవెన్యూ అధికారి తెలిపారు. చెరువు పూర్తిగా నిండితే 250 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవి.. ముంపు భూములు

చెరువుకు నీరు రావడంతో మునిగిన పొలాలు రెవెన్యూ రికార్డుల ప్రకారం ముంపు భూములు కావడం గమనార్హం. ప్రస్తుతం సాగుచేసిన మొక్కజొన్న, పత్తి పంటలు కోత దశలో ఉన్నాయి. పంటలు నీట మునగడంతో దిగుబడిని రైతులు కోల్పోతున్నారు. పంటల సాగుకు ఖర్చుచేసిన లక్షల రూపాయలు కళ్ల ముందే నష్టపోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు సాధారణంగా జనవరి, ఫిబ్రవరి నెలల్లో నీరు విడుదల చేసేవారు. ఈసారి ముందుగానే వదలడంతో పంటలు నష్టపోవాల్సి వచ్చిందని బాధిత రైతులు తెలిపారు.

పరిహారం కోసం వేడుకోలు

చెరువు ముంపు ప్రాంతంలో నష్టపోయిన పంటలను పరిశీలించడానికి వచ్చిన అధికారులకు పరిహారం అందేలా చూడాలని రైతులు విన్నవించుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని పెద్దవడుగూరు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. పంటలు నష్టపోయిన భూములు ముంపు ప్రాంత కావడంతో పరిహారం వస్తుందా.. లేదా.. అనేది సందేహాస్పదమని అధికారులు తెలపడం గమనార్హం.

రెండు మండలాల రైతుల వాగ్వాదం

చెరువుకు నీటి విడుదలతో పంటలు మునిగిన పొలాలను శనివారం పెద్దవడుగూరు తహసీల్దార్ ఉషారాణి, ఇరిగేషన్ జేఈ నూర్జహాన్, యాడికి మండల రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. అధికారుల రాకను తెలుసుకున్న పెద్దవడుగూరు, యాడికి మండలాల రైతులు అక్కడకు చేరుకున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ ఉషారాణి.. రైతులకు సర్ది చెప్పారు. ముంపు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆమె తెలిపారు.

అరటి ఫ్రూట్ కేర్ యాక్టివిటీపై దృష్టి పెట్టండి

- ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి

నార్పల మండలం నాయనిపల్లిలో అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి



అనంతపురం అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అరటి ఫ్రూట్ కేర్ యాక్టివిటీపై మరింత దృష్టి సారించాలని ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నార్పల మండలం నాయనిపల్లిలో అరటి పంటను శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి, ఏడీ దేవానంద్, ఉద్యాన అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో 13వేల ఎకరాల్లో అరటి పంట సాగులో ఉందన్నారు. జిల్లా నుంచి ప్రతి ఏడాది 50వేల నుంచి లక్ష టన్నుల అరటి వివిధ దేశాలకు ఎగుమతి అవుతోందన్నారు. ఫ్రూట్ కేర్ యాక్టివిటీని అరటి రైతులు పాటించడం ద్వారా నాణ్యమైన పండ్లను పండించడంతోపాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. అరటిలో ఫ్రూట్ కేర్ యాక్టివిటీ చేసేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా హెక్టారుకు రూ.25వేలు సబ్సిడీ మంజూరు చేస్తారన్నారు.

అగ్రిగోల్డ్ భూముల్లో వెలసిన బోర్డు



కొట్టేద్దాం!

అగ్రిగోల్డ్ భూములపై అక్రమార్కుల కన్ను

కూడేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రిగోల్డ్ భూముల్లోకి ఆక్రమణదారులు చొరబడుతున్నారు. ఈ భూములు సీఐడీ అటాచ్‌లో ఉన్నా కొందరు నిత్యం ప్లాట్లలో చొరబడి ఆక్రమించుకుంటున్నారు. రెవెన్యూ, సీఐడీ అధికారులుగాని పట్టించుకోకపోవడంతో వెంచర్ ప్రహరీతో పాటు అక్కడ ఉన్న గదిని ధ్వంసం చేసి ప్లాట్లు శుభ్రం చేస్తున్నారు. అనంతరం ప్లాట్లలో తమ పేరుతో బోర్డులు నాటేస్తున్నారు. దీనిపై అగ్రిగోల్డ్ బాధితులతోపాటు సీపీఐ నాయకులు ఆందోళన చేసిన సమయంలో మాత్రమే రెవెన్యూ అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత అటువైపు తొంగి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఇలా ఉదాసీనంగా ఉంటే అగ్రిగోల్డ్ భూములు తిరిగి ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్తాయని సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణపై విచారణ చేపడతాం

అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించినట్లు మా దృష్టికి వచ్చింది. విచారణ చేస్తాం. గతంలో కూడా వెంచర్‌లో కొందరు ఆక్రమించినట్లు సమాచారం రావడంతో అధికారులను పంపి అడ్డుకున్నాం. ప్రస్తుతం వెంచర్‌లో బోర్డులు నాటి ఉంటే, విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

- మహబూబ్‌బాషా, ఇన్‌చార్జ్ తహసీల్దారు, కూడేరు

వాల్మీకి అందరివాడు

- ఒక కులానికి పరిమితం చేయడం సరికాదు
- ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- ఆమిద్యాలలో మహర్షి విగ్రహావిష్కరణ
- పాల్గొన్న విప్, ఎంపీ, ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మంత్రి, చిత్రంలో విప్, ఎంపీ, ఎమ్మెల్యే



విగ్రహావిష్కరణలో మంత్రి, విప్, ఎంపీ

ఉరవకొండ, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకిని ఒక కులానికి పరిమితం చేయడం సరికాదని, ఆయన అందరివాడని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొన్నారు. పూజల అనంతరం మంత్రి మాట్లాడుతూ సమాజానికి రామాయణం మహా కావ్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఒక వ్యక్తి మారగలడని, మహర్షి కాగలడని చూపించిన వ్యక్తి వాల్మీకి మహర్షి అన్నారు. తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో వాల్మీకులు ఎంతో అండగా నిలిచార న్నారు. వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజానికి గొప్ప సందేశాన్ని ఇచ్చిన మహనీయుడు మహర్షి వాల్మీకి అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే వాల్మీకులంతా రుణపడి ఉంటామన్నారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నది దశాబ్దాల కల అన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే వైసీపీ ప్రభుత్వం ఆ ఫైల్‌ను పక్కన పెట్టించిం దన్నారు. అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ నమ్మితే ప్రాణమిచ్చే వారు వాల్మీకులని, వారికి తనవంతుగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో విగ్రహదాత వెంకటేష్, కమిటీ సభ్యులు సుంకన్న, మారెన్న, రామాంజనేయులు, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు రేగాటి నాగరాజు, మాజీ ఎంపీపీలు సుంకరత్నమ్మ, ప్రతాప్‌నాయుడు, గోవిందు, విజయ్‌భాస్కర్, మాజీ జడ్పీటీసీ గుర్రం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ఈనెల 3న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100సేవలను వినియోగించుకోవాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

తొలి జీతం వచ్చిందోచ్

- ఆనందంలో కొత్త టీచర్లు



కొత్త టీచర్లు (ఫైల్)

అనంతపురం విద్య, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉద్యోగం సాధించి, విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు తొలి జీతం పడింది. డీఎస్సీ నోటిఫికేషన్, పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల, నియామకం అంతా ఐదునెలల్లోనే పూర్తయ్యింది. దీంతో అక్టోబరు 3న ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి, కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించారు. గతనెల 3 నుంచే కొత్త టీచర్ల జాయినింగ్ తేదీని కామన్‌గా తీసుకొని, ఇటీవల ప్రకటించిన డీఏ ఆధారంగా నవంబరు 1న వేతనాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమచేశారు. దీంతో కొత్త టీచర్లు తొలి జీతం చూసుకుని సంతోషం వ్యక్తం చేశారు. వీరితో పాటు ఇతర సర్వీస్ టీచర్లకు శనివారం 1నే జీతాలు జమ అయ్యాయి.

సీమ అభివృద్ధి మా ఘనత



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాలని మొట్టమొదట ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్ అని, దానిని సాధ్యం చేసింది టీడీపీ అని అన్నారు. వైసీపీ రక్తం పారించినచోట తాము నీరు పారించామని అన్నారు. తప్పు చేసేవారు ఆలోచించుకోవాలని, అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు.

నీటిని పైకి తెచ్చాం..

'రాష్ట్రంలో భూగర్భ జలాలు 24 మీటర్ల లోతులో ఉన్నాయి. కానీ ఉమ్మడి జిల్లాలో పది మీటర్ల దగ్గరికి తెచ్చాం. అంతటితో సంతృప్తి పడకుండా మూడు మీటర్లకు తీసుకువస్తాం. వ్యవసాయానికి టెక్నాలజీని జోడించి ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తులను పెంచుతాం..' అని చంద్రబాబు అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏరోస్పేస్, ఐటీ, సోలార్, విండ్ పవర్, ఆటోమొబైల్ పరిశ్రమలకు అనుకూలమని, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నామని, ఉపాధి కల్పన జిల్లాగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. టీడీపీ ప్రభుత్వంపై విశ్వాసంతోనే జిల్లాకు కియ వచ్చిందని, నేడు ఈ ప్రాంతం వైపు పరిశ్రమలు క్యూ కట్టే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. రాయలసీమను బాగు చేయలేమని అందరూ వదిలేశారని, కానీ తాము రతనాల సీమగా మార్చి చూపించామని అన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి

పుట్టపర్తిని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు అన్నారు. సత్యసాయి జయంతి వేడుకలను ప్రభుత్వ వేడుకలుగా ప్రకటించామని, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. 'నేను పుట్టపర్తికి వచ్చినప్పుడు సత్యసాయి బాబా నా వద్దకు వచ్చారు. బంగారు అని ఆప్యాయంగా పిలిచారు. నీతో ఓ చిన్న మాట చెప్తా చేస్తావా అని అడిగారు. సరే అన్నాను. ప్రపంచం మొత్తం పుట్టపర్తికి వస్తోంది. అనంతపురం జిల్లాలో తాగునీటి సమస్య ఉంది. పైపులైను వేయిస్తాం. నీళ్లు ఇవ్వగలవా అని అడిగారు. నేను ఎల్అండ్‌టీ వారితో పనులు పూర్తి చేయించాను. కానీ గత పాలకులు మూసివేసే స్థాయికి తెచ్చారు..' అని గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాకే కాకుండా మహబూబ్‌నగర్, మెదక్ సహా పలు ప్రాంతాలకు తాగునీరు ఇచ్చిన మహనీయులు పుట్టిన గడ్డ పుట్టపర్తి అని, సేవ నేర్పిన వ్యక్తి సత్యసాయి బాబా అని అన్నారు. ఆయన శత జయంతి ఉత్సవాలను ఈ నెల 13 నుంచి 23 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. దీనికోసం మంత్రుల కమిటీని ఏర్పాటు చేశానని తెలిపారు. సత్యసాయి ట్రస్టుతో కలిసి మంత్రుల కమిటీ శత జయంతి ఉత్సవాలను పర్యవేక్షిస్తోందని అన్నారు.



మేడా రెడ్డెమ్మ ఇంటి వద్ద గ్రామస్తులతో కలిసి టీ తాగుతున్న సీఎం



మేడా రెడ్డెమ్మ ఇంట్లో దోశ వేస్తున్న సీఎం చంద్రబాబు

బాబు.. బంగారం..!

పీ4 కింద ఇద్దరి దత్తత



మహేశ్వరిని దత్తత తీసుకుంటానని చెబుతున్న మన్సూర్

పెద్దన్నవారిపల్లి ప్రజా వేదికపై పీ4 కార్యక్రమం గురించి సీఎం చంద్రబాబు వివరించారు. సీఎం సమక్షంలో ఇద్దరు మహిళలు తమ కష్టాలను చెప్పుకోగా, వారిని ఇద్దరు మార్గదర్శులు దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చారు. వేదిక జరిగిన సంభాషణలు ఇవి..

మహేశ్వరి: నమస్కారం సార్. నాకు ఇద్దరు అన్నలు. వారికి పెళ్లి అయింది. నాకు చిన్నప్పుడే రెండు కాళ్లు వంకర్లు పోయాయి. స్కూల్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డాను. పుస్తకాలను కూడా మోయలేకపోయాను. నా స్నేహితులే పుస్తకాలు తీసుకొచ్చేవారు. నా రెండు కాళ్లకు ఆపరేషన్ చేశారు. కష్టపడి చదువుకున్నాను. మా రెండో అన్న చనిపోయారు. వారి పిల్లలను పోషించుకుంటున్నాం. నా తల్లిదండ్రులను పోషించుకుంటున్నాను.

చంద్రాబాబు: ఏమి చదువుకున్నావమ్మా..?

మహేశ్వరి: ఇంటర్ వరకు చదువుకున్నాను సార్. పింఛన్ డబ్బుతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మా అమ్మకు గుండె సమస్య ఉంది. నాకు పెళ్లి కాలేదు. ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పిస్తే మా కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. పింఛన్ డబ్బుతోనే మా జీవనం సాగుతోంది.

చంద్రబాబు: మహేశ్వరికి తల్లిదండ్రులు మాత్రమే ఉన్నారు. పింఛన్‌నే ఆధారం. వచ్చిన ఆదాయం చాలడంలేదు. అందుకే ఈ అమ్మాకి మార్గదర్శిని ఏర్పాటు చేస్తున్నాం.

మన్సూర్(మార్గదర్శి): నమస్కారం సార్. నా పేరు మన్సూర్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. నాకొచ్చే ఆదాయంలో కొంత ప్రజలకు ఖర్చు చేయాలని ఎన్జీఓను స్థాపించాను. విద్య, వైద్యం, దివ్యాంగులకు చేయూత వంటి సేవలు చేస్తున్నాను. తలుపుల ప్రాథమిక వైద్యశాలలో ప్రతి నెలా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నాను. మహేశ్వరిని బంగారు కుటుంబం కింద నేను దత్తత తీసుకుంటున్నాను. ఉద్యోగ కల్పనకు కృషి చేస్తాను. విద్య విషయంలోనూ సాయపడతాను.

సీఎం: మంచి ఆలోచన. ఇటువంటి వారు మరికొంతమంది మార్గదర్శులుగా ఉండాలి. అందుకే ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాం.

చైతన్య: నమస్కారం సార్. నా పేరు దేవర్ల చైతన్య. నా భర్త పేరు దేవర్ల ఉమాపతి. నాది పేద కుటుంబం. పిల్లలను పోషించుకోవడానికి చాల ఇబ్బందులు పడుతున్నాం.

చంద్రబాబు: ఎంతమంది పిల్లలమ్మా..?

చైతన్య: ముగ్గురు సార్.

సీఎం: ఏమి చదువుతున్నారమ్మా..?

చైతన్య: కూతరు 8వ తరగతి, కొడుకులు ఐదో తరగతి, మూడో తరగతి సార్.

సీఎం: ముగ్గురికీ తల్లికి వందనం వచ్చిందామ్మా..?

చైతన్య: వచ్చింది సార్. మాకు ఉండటానికి ఇల్లు లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇల్లు కావాలి, పిల్లలకు మంచి స్కూల్ కావాలి సార్.

సుబ్బారెడ్డి (మార్గదర్శి): నమస్కారం సార్. నేను రైతును. పది ఎకరాల పొలం ఉంది. మామిడి, వరి, వేరుశనగ పంటలు సాగుచేస్తాం.



సీఎం సమక్షంలో మహిళ చైతన్య, రైతు సుబ్బారెడ్డి

సీఎం: ఈ అమ్మాయికి సహాయపడే శక్తి మీకుందా..?

మార్గదర్శి: ఉంది సార్. విద్య, వైద్యానికి సాయం చేస్తాను సార్.

సీఎం: ఇల్లు కట్టించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. వెంటనే ఇల్లు కట్టించి ఇవ్వండి(అధికారులకు ఆదేశం). ఆ అమ్మాయికి ఏమికావాలో సుబ్బారెడ్డి సమకూరుస్తారు.

ఇంటికి చేరని పింఛన్!

- సొమ్ము తీసుకునేందుకు వచ్చి వృద్ధురాలికి అస్వస్థత



అస్వస్థతకు లోనైన వృద్ధురాలిని 108 వాహనంలో తరలిస్తున్న గ్రామస్థులు

రొద్దం/బొమ్మనహాళ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం గట్టిగా ఆదేశిస్తున్నా.. నేటికీ కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక చోటుకి లబ్ధిదారులను పిలిపించుకుని, అందరికీ అక్కడే అందజేస్తున్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రొద్దంలోని హరిజనవాడకు చెందిన వృద్ధురాలు హనుమక్క నడవడానికి ఇబ్బందిపడుతోంది. అలాంటి వృద్ధురాలి ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేయాల్సిన సచివాలయ సిబ్బంది.. ఆమెనే రావాలన్నారు. దీంతో అర కిలోమీటరు దూరంలో ఉన్న పశువుల ఆస్పత్రికి పింఛన్ సొమ్ము కోసం వృద్ధురాలు శనివారం వెళ్లారు. నీరసంతో అస్వస్థతకులోనై, అక్కడే పడిపోయారు. దీంతో టీడీపీ నాయకుడు ఉగ్గిరప్ప 108 వాహనంలో పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. రొద్దం-1 సచివాలయ ఉద్యోగులు రొద్దం మండల కేంద్రంలోని పాత హరిజనవాడలో పంపిణీ చేయాల్సి ఉండగా... వారందరినీ పశువుల ఆస్పత్రికి రప్పించడంతోనే హనుమక్క అస్వస్థతకు లోనైనట్లు స్థానికులు మండిపడుతున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ రామ్‌కుమార్‌ను అడగ్గా.. విషయం తమ దృష్టికి రాలేదనీ, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్



ఒకే చోట పింఛన్ సొమ్ము పంపిణీ

బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గ్రామంలో పింఛన్ పంపిణీలో సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. శనివారం గ్రామంలో ఒకేచోట పంపిణీ చేయడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సచివాలయ సిబ్బంది తీరుపై మండిపడ్డారు.

విద్యతోనే చైతన్యం

- గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు

అనంతపురం విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే చైతన్యం సాధ్యమనీ, ప్రతి గిరిజన బిడ్డ బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు (డీడీ) శ్రీనివాసరావు సూచించారు. గిరిజన నేతలు బిర్సాముండా, అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నగరంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో శనివారం గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ప్రారంభించారు. తొలుత ర్యాలీ చేపట్టారు. బిర్సాముండా, అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గిరిజనులను చైతన్యవంతులను చేయడానికి బిర్సాముండా, అల్లూరి చేసిన కృషి ఎనలేనిదన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన గిరిజన విద్యార్థులకు బహుమతులు అందజేసి, అభినందించారు.

పీఏబీఆర్ గేట్లు బంద్

- కొనసాగుతున్న జల విద్యుదుత్పత్తి



డ్యాం గేట్లను అధికారులు మూసివేసిన దృశ్యం

కూడేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) ప్రధాన గేటును శనివారం బంద్ చేశారు. ఐదు రోజులుగా గేట్లు ఎత్తి మిడ్ పెన్నార్‌కి నీటిని వదిలారు. ప్రస్తుతం డ్యాంలోని జల విద్యుత్ కేంద్రంలో ఒక టర్బైన్‌తో 885 క్యూసెక్కుల నీటిని వినియోగించి దాదాపు 75వేల యూనిట్ల కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. డ్యాంలో నీటి మట్టం 435.500 మీటర్లకు చేరింది. నీటి నిల్వ 5.214 టీఎంసీల చేరిందని ఇరిగేషన్ ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు. డ్యాంలోకి లింక్ చానల్ నుంచి 100 క్యూసెక్కులు, హంద్రీనీవా నుంచి 60 క్యూసెక్కుల నీరు మాత్రమే ఇన్‌ఫ్లో ఉందనీ, 1000 క్యూసెక్కుల బయటకు వదులుతున్నట్లు ఆమె తెలిపారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 27 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు చెప్పారు.

కసాపురం ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్



ఆలయం వద్ద మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి సహకరిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ తెలిపారు. ఆయన శనివారం ఆలయాన్ని సందర్శించారు. ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ కసాపురం ఆలయం అభివృద్ధి చెందితే గుంతకల్లు పట్టణం కూడా అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ఆలయానికి రూ.10 కోట్లు విరాళాలు రావడం అభినందనీయమన్నారు. దేవాలయంలో వసతి గదులు శుభ్రంగా ఉంచాలన్నారు, భోజనశాలను పెద్ద హాల్‌లో ఏర్పాటు చేయాలని, అవకతవకలు జరగకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహేష్, రాము, రామాంజినేయులు, దేవేంద్ర, ఎస్ఎండీ గౌస్, ఈశ్వరయ్య, ఉమర్‌బాషా, నాగరాజు, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య.. విజయానికి తొలి అడుగు

- మొబైల్స్ ఇండియా ఏజీఎం అశోక్‌కుమార్



జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయానికి ఉన్నత విద్య తొలి అడుగు అని మొబైల్స్ ఇండియా లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) అశోక్‌కమార్ అన్నారు. ఇటుకలపల్లి సమీపంలోని అనంతలక్ష్మి కాలేజీలో ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే శనివారం నిర్వహించారు. అశోక్‌కమార్‌తోపాటు అనంతలక్ష్మి విద్యాసంస్థల చైర్మన్ అనంతరాముడు జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ..ఎంబీఏ, ఎంసీఏ.. విద్యార్థులకు నాయకత్వం, నిర్వహణ, వ్యూహాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలను అందించే ప్రతిష్ఠాత్మక కోర్సులన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రతి విద్యార్థి మంచి ఉద్యోగాలను సాధించాలన్నారు. అనంతరం ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మొమెంటోలను వారు అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎంబీఏ విభాగాధిపతి చక్రధర్ పాల్గొన్నారు.

రోజూ తనిఖీలే

- పాఠశాలల పనితీరును పరిశీలించాలన్న కమిషనర్
- ఆకస్మికంగా వెళ్లాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు
- హెడ్మాస్టర్లూ పాఠాలు చెప్పాల్సిందే
- మంగళవారం నుంచి అమలు.. డీఈఓ సమీక్ష



ఏడీ, ఏసీ, సూపరింటెండెంట్లు, ఐటీ సెల్ సిబ్బందితో చర్చిస్తున్న డీఈఓ

అనంతపురం విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు జిల్లా విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పాఠశాలలు రోజువారి తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఉపాధ్యాయుల బదిలీలు, నియామకాలు పూర్తయిన నేపథ్యంలో బోధనాభ్యసన ప్రక్రియపై దృష్టి సారించాలని డీఈఓ నిర్ణయించారు. పాఠశాలలో అకడమిక్ కేలండర్ మేరకు బోధన జరుగుతోందా ? టీచర్లు, విద్యార్థుల హాజరు ఎలా ఉంది? టీచర్లు నోట్‌బుక్స్ రాయిస్తున్నారా? రాసిన వాటిని చూస్తున్నారా? పదోతరగతి విద్యార్థుల పరిస్థితులు తదితర వాటిగురించి తెలుసుకోవడానికి పాఠశాలలు రోజూ తనిఖీ చేయాలని ఇదివరకే విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాలు అమలు చేయడం కోసం శనివారం కార్యాలయంలో ఏడీలు, ఏసీ, సూపరింటెండెంట్లు, ఐటీసెల్ సిబ్బందితో డీఈఓ సమీక్షించారు. తనిఖీలను మంగళవారం నుంచి ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు.

మంగళవారం నుంచి శనివారం వరకు..

డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓ-1, ఎంఈఓ-2లు ప్రతి రోజూ తప్పనిసరిగా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓ-2మాత్రమే పాఠశాల తనిఖీకి వెళ్లేవారు. ఇపుడు ఎంఈఓ-1 సైతం తనిఖీకి వెళ్లాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, టీచర్ల సంఖ్య, హాజరు. టీచర్లు ఉదయం 9గంటలకు హాజరు వేశారా? పిల్లల హాజరు సమయానికి వేసి ఆన్‌లైన్‌లో పంపారా? బోధన ఎలా ఉంది తదితర విషయాలను పరిశీలించి రికార్డులలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఎవరు ఎక్కడకు వెళ్లారో అక్కడకు సంబంధించిన ఫొటోలను తనిఖీ అధికారులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వారంలో ప్రతి మంగళవారం నుంచి శనివారం వరకు తనిఖీలు చేస్తారు. సోమవారం గ్రీవెన్స్‌లలో అధికారులు ఆయా స్థాయిలో హాజరుకావాల్సి ఉంటుంది.

ప్రతి హెచ్ఎం బోధించాల్సిందే

ఇటీవల కాలంలో పని ఒత్తిడి పేరుతో ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పాఠాలు బోధించడం లేదు. అధికారుల తనిఖీలు లేకపోవడం, ఎంఈఓలే డిప్యూటీ డీఓలుగా ఉండటం, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు ఎంఈఓలుగా కొనసాగుతుండటం వల్ల ఎవరూ ఎవరినీ ప్రశ్నించే పరిస్థితులులేవు. అందుకే కమిషనర్ విజయరామరాజు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూడా వారానికి ఐదు పిరియడ్లు వారి సబ్జెక్టును తప్పనిసరిగా బోధించాలని ఆదేశించినట్లు డీఈఓ ప్రసాద్ బాబు వెల్లడించారు. తనిఖీలకు వెళ్లినపుడు హెచ్ఎంల బోధనను కూడా పరిశీలించాలని సూచించారు.

పాఠశాల పని వేళల్లో రావొద్దు

పాఠశాల పని వేళల్లో ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్లు ఎవరూ కూడా విద్యాశాఖ కార్యాలయాల వద్దకు రాకూడదని కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. ఎవరికైనా పనులు ఉంటే బడి సమయం ముగిసిన తర్వాత వచ్చి వినతులు ఇచ్చుకోవచ్చు. వాటి పరిష్కారానికి అధికారుల నుంచి ఉత్తర్వులు పొందవచ్చు. ఇందుకోసం డీఈఓ, డిప్యూటీ డీఈఓలు ప్రతి రోజూ సాయంత్రం 5గంటలనుంచి 6గంటలవరకు ఆఫీస్‌లలో అందుబాటులో ఉండాలని కమిషనర్ ఆదేశించారని డీఈఓ తన సమీక్షలో వివరించారు.

పది ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఎంతమంది పిల్లలు పదో తరగతి చదువుతున్నారు? వారి సామర్థ్యాలు ఏస్థాయిలో ఉన్నాయో తనిఖీలకు వెళ్లినపుడు అధికారులు ఆరా తీయాలన్నారు. తర్వాత ఆ విద్యార్థుల సామర్థ్యాలను బట్టి ఏ,బీ,సీ,డీలు గా విభజించి సీ, డీ కేటగిరి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని డీఈఓ సూచించారు. ఇలా చేస్తే పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉంటుందని డీఈఓ పేర్కొన్నారు.

సస్య రక్షణతోనే అధిక దిగుబడులు

- రేకలకుంట శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం



సుబ్రహ్మణ్యం, శాస్త్రవేత్త

బుక్కరాయసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్య రక్షణ చర్యలతో పండ్ల తోటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని రేకలకుంట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మొంథా తుపాను వల్ల ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటలకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. ఈదురు గాలులకు స్వల్పంగా మొక్కలు ఒరిగాయే కానీ ఎక్కడా నష్టం జరగలేదన్నారు. అయితే గత ఐదు రోజులుగా కురిసిన వర్షాల వివిధ రకాల తెగుళ్లు ఆశించినట్లు తెలిపారు. వాటి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్త పలు సూచనలు చేశారు.

- ప్రస్తుతం వరుసగా కురిసిన వర్షాలకు అరటిలో సిగటోక తెగలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. దీని నివారణకు టిల్ట్0.5 మి.లీ లేదా కవచ్2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.
- దానిమ్మ పంటలో ఆకులు, కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడటం, కాయలు పగిలి కుళ్లిపోవడం వంటి లక్షణాలతో మచ్చ తెగులు, లేదా కాయకుళ్లు (ఫ్రూట్‌రాట్) ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రామ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి కార్బండజిమ్ 1 గ్రామకూడా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవచ్చు
- చీనీ(బత్తాయి) పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పొలుసు పురుగు వస్తోంది. తెగులుతో చెట్టు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉంది. ఆకులు లేకుండా కొమ్మలు మాత్రమే ఉంటాయి. నివారణకు కాండాన్ని , కొమ్మలను గోనే సంచి(పట్టా)తో రుద్ది కెలియాల్ ఆయిల్ 5 మి.లీ లేదా హర్టి మినరల్ ఆయిల్ 5 మి.లీ, డైమిథోయోట్2. మి.లీ లేదా బుప్రొఫెజిన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి మొక్క బాగా తడిసేలా పిచికారీ చేసుకోవాలన్నారు.
- బొప్పాయిలో కాండం కుళ్ళు (స్టెమ్‌రాట్) బుజు తెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే కాండం మొదలు వద్ద నీరు చేరి కుళ్లిపోవడం, ఆకుల కింద తెల్లటి బూజు కనిపిస్తుంది. నివారణకు కాండం కుళ్లిన చోట కాపర్ ఆక్సీక్లోరైడ్ 4 గ్రా., లీటరు నీటిలో కలిపి పూయాలి. శిలీంద్ర నాశకాలైన మెటలాక్సిల్ 2 గ్రా-లీటరు నీటితో పిచికారీ చేయాలన్నారు.
- ప్రస్తుతం మిరప పంట అక్కడక్కడ శాఖీయ దశలో ఉంది. ప్రస్తుత వాతావరణం తామర పురుగు, పచ్చ పురుగు ఆశించడానికి అనుకూలం. తామర పురుగుల నివారణకు నీలం, పసుపు రంగు జిగిరు అట్టలు ఎకరాకు 30-40 వరకు పెట్టుకోవాలి. అలాగే 10000 పీపీఎం వేప నూనెను 1.0మి.లీ లేదా అసిటమాప్రిడ్ 0.2 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చపురుగు నివారణకు ఎమా మెక్టిన్ బెంజోయోట్ 0.4 లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వరి పంటలో వాన నీటిని నీటిని తీసివేయాలి. ప్రస్తుతం వరి పంట కంకి ప్రారంభ దశ నుండి గింజ వృద్ధి దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో సుడిదోమ ఆశించడానికి అవకాశం ఉంది. సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే పైమెట్రోజిన్ 0.6 గ్రా లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా - లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. బ్యాక్టీరియా, ఆకు మచ్చ తెగులు నివారణకు కాపర్ హైడ్రోక్సైడ్ 30 గ్రా, స్ట్రెప్టోక్లిన్ 1 గ్రా. 10 లీటర్లనీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు రైతుల నిరాశ చెందకుండా ఉద్యానశాఖ శాస్త్రవేత్తలను సంప్రదించి సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పప్పుశనగలో పచ్చపురుగు

బెళుగుప్ప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల తేమ ఎక్కువై పప్పుశనగ పైరుకు పచ్చపురుగు ఆశించింది. ముందస్తు వర్షాలు కురవడంతో ఈ ఏడాది 15 రోజులు ముందుగానే మండలంలో పప్పు శనగ పంట సాగు చేశారు. మండలంలో తగ్గుపర్తి, బెళుగుప్ప, దుద్దేకుంట, గంగవరం, ఎర్రగుడి, వెంకటాద్రిపల్లి తదితర గ్రామాలలో అత్యధికంగా పప్పుశనగ పంటలు సాగు చేశారు. మండల వ్యాప్తంగా 9300 ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు. ఓ పక్క వేరుకుళ్లు తెగులు సోకి మొక్కలు చనిపోతుండగా, మరో పక్క పచ్చపురుగు ఆశించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పచ్చపురుగు నివారణకు లీటరు నీటికి నాలుగు గ్రాముల ఇమమేకటిన్ బెంజో ఎట్ పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ రైతులకు సూచించారు.





పచ్చపురుగు నివారణకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న రైతు వన్నూరుస్వామి, పైరును పచ్చ పురుగు ఆశించిన దృశ్యం

కాలువలో పడి విద్యార్థి మృతి


పృథ్వీరాజ్ (ఫైల్)

పెద్దవడుగూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పృథ్వీరాజ్(14) శనివారం యాడికి కాలువలో పడి మృతి చెందాడు. బుర్నాకుంట గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ బంధువుల వివాహం నేపథ్యంలో రెండురోజులుగా పాఠశాలకు వెళ్లలేదు. తల్లి శశికళ శనివారం పొలం పనికి వెళ్లడంతో ఆమెకు భోజనం తీసుకుని ఆ బాలుడు బయల్దేరాడు. అయితే యాడికి కాలువ వంతెన దాటే సమయంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో పడ్డాడు. అక్కడ ఉన్న కొందరు గమనించి పృథ్వీరాజ్‌ను బయటకు తెచ్చారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. ఇప్పటికే భర్తను పోగొట్టుకుని బతుకుతున్న ఆ తల్లి కుమారుడి మృతితో కుప్పకూలిపోయింది. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

గార్లదిన్నె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలికను వంచించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన ఓ బాలిక ఇంటర్మీడియట్ వరకు చదువుకుని, అనంతపురంలో ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తుండేది. కొన్ని నెలల క్రితం ఓ వివాహ కార్యక్రమంలో పామిడి మండలం పాళ్యం తండాకు చెందిన సురేష్ నాయక్ పరిచయం అయ్యాడు. వివాహం చేసుకుంటానని సురేష్ మాయమాటలు చెప్పి.. లోబరుచుకున్నాడు. మూడురోజుల క్రితం బాలికకు కడుపునొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. గర్భం దాల్చినట్లు తేలింది. విషయం తెలుసుకున్న యువకుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సురేష్ నాయక్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్కూటీలో ఉంచిన రూ.6 లక్షలు చోరీ

గుత్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద స్కూటీలో ఉంచిన రూ.ఆరు లక్షలు చోరీ అయినట్లు బాధితుడు ఓబులేసురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దవడూగురు మండలం కాశేపల్లి గ్రామానికి చెందిన ఓబులేసురెడ్డి కొంతకాలంగా స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్నాడు. చేసిన అప్పులు తీర్చడం కోసం భూమిని విక్రయించాడు. వచ్చిన డబ్బును రుణదాతలకు ఇచ్చేందుకు తన స్కూటీ డిక్కిలో రూ. 6లక్షలు ఉంచుకుని బయల్దేరాడు. అయ్యప్పమాల ధరించి ఉండటంతో స్వామిని దర్శనం చేసుకునేందుకు అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లాడు. స్వామిని దర్శించుకుని బయటకు వచ్చిన తరువాత తన స్కూటీలో ఉంచిన నగదు చోరీ అయినట్లు గమనించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు


పట్టుబడిన నిందితులు, చోరీ సొత్తును చూపుతున్న ఎస్ఐ

ధర్మవరంరూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలను శనివారం ఆయన స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చిగిచెర్ల గ్రామంలో వీరముద్దప్ప గుడి, గొట్లూరులో మహంకాళమ్మ, పెద్దమ్మ గుడి, రాంపురంలోని సత్యమ్మ ఆలయాల్లో జరిగిన చోరీలపై కేసులు నమోదు చేశామన్నారు. వీటిపై పలు కోణాల్లో విచారణ చేసినట్లు వెల్లడించారు. ఈక్రమంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన గురునాథం అంజయ్య, గురునాథం ఆంజనేయులు, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలుకా ఎగువపల్లికి చెందిన గురునాథం వెంకటేశ్వర్లు చోరీలు చేసినట్లు తేలడంతో వారిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 30 వెండి గొడుగులు, (340గ్రాములు) మూడు గ్రాముల బంగారం తాళిబొట్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు ఊరు చివరన ఉన్న ఆలయాలపై రెక్కీ నిర్వహించి, రాత్రి పూట చోరీలకు పాల్పడేవారని తెలిపారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు


నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగుదారి చూపినట్లు యువర్స్‌ఫౌండేషన్ ప్రెసిడెంట్ పోలాప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని తొగటవీధికి చెందిన పెద్దకోట్ల రామకృష్ణ(70) శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాసులు, వెంకటనారాయణ మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర నేత్రాలను సేకరించారు. నేత్రాదానికి సహకరించిన మృతుడి భార్య నాగరత్న, కుమారుడు రాజేంద్రకు యువర్స్‌ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో వీరంగం

అమ్మవారి విగ్రహం ముక్కు ధ్వంసం
హుండీ సొమ్ము అపహరణ


అమ్మవారి విగ్రహం ముక్కును ధ్వంసం చేసిన దుండగులు

నార్పల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మారెమ్మ గుడిలో శుక్రవారం రాత్రి తాగుబోతులు వీరంగం చేశారు. అమ్మవారి విగ్రహం ముక్కును ధ్వంసం చేసి, ఆలయంలోని హుండీని అపహరించారు. ఆలయ పరిసరాల్లో మద్యం తాగి, బాటిల్, వాటర్ ప్యాకెట్లు అక్కడే వదిలేశారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండగులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని కోరుతూ నార్పల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్ఐ సాగర్, సీఐ కౌలుట్లయ్య ఆలయాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు. ఆలయంలో వీరంగం చేసిన వారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.


ఆలయంలో చెల్లాచెదురుగా విసిరేసిన వస్తువులు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నలుగురికి గాయాలు



రోదిస్తున్న పెద్దపుల్లన్న భార్య, కుటుంబ సభ్యులు, పెద్ద పుల్లన్న (ఫైల్)



ప్రజ్వల్‌ను ఒడిలో పెట్టుకుని బోరున విలపిస్తున్న వన్నూరక్క పొలంలో కారు

గుంతకల్లుటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో శనివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా.. నలుగురు గాయపడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం అలుముకుంది. గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామం వద్ద కూలీల ఆటో బోల్తా పడి ఒకరు దుర్మరణం చెందగా.. ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని దంచర్ల గ్రామానికి చెందిన పెద్ద పుల్లన్న (45) ప్రాణాలు కోల్పోయాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దంచర్ల గ్రామానికి చెందిన పది మంది వ్యవసాయ కూలీలు ఆటోలో దోనిముక్కల గ్రామ సమీపంలోని పొలంలో పనులకు వెళ్లారు. మధ్యాహ్నం పని ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. తిమ్మాపురం గ్రామ సమీపంలోకి రాగానే వెనుక వస్తున్న టిప్పర్ డ్రైవర్.. ముందు గొర్రెల మందను పక్కకు తిప్పాడు. టిప్పర్ ఎక్కడ తగులుతుందోనని ఆటోను డ్రైవర్ పక్కకు తిప్పాడు. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో పెద్ద పుల్లన్న అక్కడికక్కడే మృతిచెందగా.. రంగస్వామి, ఎల్లప్ప, రామాంజనేయులు గాయపడ్డారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దపుల్లన్నకు భార్య సువర్ణ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి మృతి.. తండ్రి పరిస్థితి విషమం..

కళ్యాణదుర్గం(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్ల గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో కుమారుడు మృతిచెందగా.. తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోళ్ల గ్రామానికి చెందిన వన్నూరుస్వామి... కుమారుడు ప్రజ్వల్ (6)తో కలిసి కళ్యాణదుర్గం పట్టణానికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. గోళ్ల సమీపంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ద్విచక్రవాహనంలో ఉన్న తండ్రి, కుమారుడు ఎగిరి పడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగా ప్రజ్వల్ మృతిచెందాడు. వన్నూరుస్వామి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో అందులోని వారు క్షేమంగా బయటపడ్డారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రాయల్ వెంకటేశులుకు చెందిన కారుగా పోలీసులు గుర్తించారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని తెలుస్తోంది. ప్రమాద స్థలంలో ప్రజ్వల్‌ను ఒడిలో పెట్టుకుని తల్లి వన్నూరమ్మ బోరున విలపించడం కలచివేసింది. ప్రమాదంపై కళ్యాదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారం కోసం వచ్చి..


గోవిందరాజ్ మృతదేహం

రొళ్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాజంపాళ్యం గ్రామ సమీపాన బైక్‌ను ఆటో ఢీకొన్న ప్రమాదంలో చిరు వ్యాపారి గోవిందరాజ్(35)దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. కర్ణాటకలోని కంబదహళ్లి గ్రామానికి చెందిన గోవిందరాజ్ వ్యాపారం నిమిత్తం ద్విచక్రవాహనంలో వెళ్లి వస్తుండగా రత్నగిరి వైపు నుంచి వస్తున్న ఆటో రోడ్డు మలుపు వద్ద ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న గోవిందరాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సార్...! జలహారతికి రండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆహ్వానం


సీఎం చంద్రబాబు వెంట నడుస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలతో మడకశిర నియోజకవర్గంలో పలు చెరువులను నింపుతున్నారు. మడకశిర నియోజకవర్గ చరిత్రలోనే అమరాపురం చెరువును నీటితో నింపిన దాఖలాలు లేవు. హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలతో అమరాపురం చెరువును నీటితో నింపుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డిసెంబరులో నిర్వహించే జలహారతికి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆహ్వానించారు. తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో శనివారం నిర్వహించిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇదే సందర్భంలో జలహారతి కార్యక్రమానికి రావాలని విన్నవించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎంహెచ్‌ఓ ఈబీ దేవితో కలిసి జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలపై సమీక్షించారు. అనంతపురం రూరల్ కురుగుంట-2, యాడికి-1, రాయదుర్గం-1, కొర్రపాడు-1, కొర్రపాడు యూపీహెచ్‌సీలో జరిగిన మాతృ మరణాలపై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రసవిస్తూ ఏ తల్లీ, జన్మిస్తూ ఏ బిడ్డా చనిపోకూడదన్నారు. కొర్రపాడు పరిధిలోని చదల్ల గ్రామానికి చెందిన రాధమ్మ మాతృ మరణానికి బాధ్యురాలైన ఆశా వర్కర్‌ను విధుల నుంచి తొలగించడంతోపాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యాడికి మండలం వీరన్నపల్లికి చెందిన హరిత అనే మహిళ మరణానికి కారణమైన ఆర్ఎంపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనీ, ఆశా, ఏఎన్ఎంపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలనీ, వైద్యాధికారికి మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కురుగుంటకు చెందిన మృదుల మృతికి కారణమైన వైద్య, ఆరోగ్య సిబ్బందికి మెమోలు జారీ చేయాలన్నారు. సమావేశంలో వైద్యులు జయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, శంషాద్‌బేగం, నారాయణ స్వామి, గంగాధర్ పాల్గొన్నారు.

కుష్ఠును ఆదిలోనే అరికట్టాలి

అనంతపురం వైద్యం(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు 14రోజులపాటు కుష్ఠు వ్యాధిపై సర్వే చేపడతారన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ జయలక్ష్మి, డీఎన్ఎంఓ డాక్టర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తరించాలి...

రెడ్ క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువయ్యేలా విస్తరింపజేయాలని సంస్థ నిర్వాహకులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ప్రథమ చికిత్స విధానంపై పరిశ్రమల్లోని కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా కార్మిక భద్రత మెరుగుపడుతుందన్నారు. రక్తనిధి కేంద్రాల్లో సరిపడా నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి, రాష్ట్ర సభ్యుడు కాపు రామచంద్రారెడ్డి, వైస్‌ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణప్రసాద్, కార్యదర్శి మోహనకృష్ణ పాల్గొన్నారు.

మురడి ఆలయ పవిత్రతను కాపాడుతా

● కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మురడి ఆలయ పవిత్రతను కాపాడుతానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మురడి ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడికి న్యాయం చేయాలనే విషయంలో తాను ఇచ్చిన లేఖపై సోషల్ మీడియాలో వివాదం చెలరేగిన నేపథ్యంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతశయన అనే అర్చకుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు డి.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో కేసు నమోదు అయిందన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో అతన్ని ఆలయ అర్చకత్వం నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఆ తరువాత భార్య, భర్తలు రాజీపడి కోర్టులో కేసు కొట్టి వేయించుకున్నా రని వెల్లడించారు. తర్వాత వారి కుమార్తెతో కలిసి తన వద్దకు పలుమార్లు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవడానికి సాయం చేయమని కోరారని తెలిపారు. ప్రవర్తన సరిగాలేని వ్యక్తిని తాను సాయం చేయనని చెప్పానన్నారు. తర్వాత ఆ గ్రామ నాయకులు, మండల నాయకులు ఆలయంలో అర్చకత్వం చేసుకునేందుకు లేఖ ఇమ్మని చెప్తే ఐదునెలల కిందట ఇచ్చానన్నారు. ఒక పవిత్రమైన ఆలయంలో అర్చకత్వం చేసే విషయంలో వివాదం ఉన్నప్పుడు లేఖ ఇవ్వకపోయి ఉంటే బాగుండేదన్నారు. లేఖ ఇచ్చినంత మాత్రాన ఆలయంలో అతన్ని అర్చకుడిగా మళ్లీ నియమించలేదన్నారు. దీనిపై కొందరు వివాదం సృష్టించేందుకు ప్రయత్నిస్తుండటం దారుణమన్నారు. అయినా ఇది నైతిక ప్రవర్తనకు సంబంధించిన అంశం కాబట్టి ఓ ప్రజాప్రతినిధిగా వివరణ ఇవ్వాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి తలెత్తకుండా జాగ్రత్త వహిస్తానన్నారు.

నేటి నుంచి సీకే నాయుడు క్రికెట్ టోర్నీ


కెప్టెన్లతో రెఫరీల సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సీకే నాయుడు జాతీయ క్రికెట్ టోర్నీని నగరంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఆంధ్రా అండర్-23, పాండిచ్చేరి అండర్-23 జట్ల మధ్య ఈ మ్యాచ్ ఆదివారం నుంచి ఐదో తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గతేడాది జరిగిన దులీప్‌ట్రోఫీ తరహాలోనే ఈ మ్యాచ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రా, పాండిచ్చేరి జట్లు అనంతకు చేరాయి. మైదానంలో శనివారం ఉదయం, సాయంత్రం ఇరుజట్ల క్రీడాకారులు బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ అంశాల్లో ప్రాక్టీస్ చేశారు. మ్యాచ్ అఫిషియల్స్ రెఫరీ నియతీలోకూర్, అంపైర్లు అభిజిత్ దేశ్‌ముఖ్, కేఆర్ వాసుకి, ఆంధ్రా కెప్టెన్లు హేమంత్‌రెడ్డి, సీయాన్ శ్యామ్ కంగయాన్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి మైదానంలో పిచ్, ఏర్పాట్లను పరిశీలించారు.

టమోటా కిలో రూ.23

అనంతపురంరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.10తో, సరసరిగా రూ.16తో విక్రయాలు జరిగాయన్నారు.

ఉత్తరాలు రాయండి

తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్నాథ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే లెటర్ రైటింగ్ పోటీలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ అమర్నాథ్ శనివారం ప్రకటనలో కోరారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా లెటర్ టు మై రోల్‌మోడల్ అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలలోపు, ఆ పైబడిన వారికి రెండు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి విభాగం ఇన్‌లాండ్ లెటర్ కార్డ్(ఐఎల్‌సీ) కేటగిరిలో 500 పదాలకులోపుగా ఉండాలన్నారు. రెండో విభాగం ఎన్వలప్ కేటగిరిలో 1000 పదాలకు మించకుండా రాయాలన్నారు. చేతితో రాసిన ఉత్తరం మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ బాషలలో రాసిన ఉత్తరాలను డిసెంబరు 8లోపు అనంతపురంలోని ప్రధాన తపాలా సూపరింటెండెంట్ కార్యాలయానికి పంపాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు అందజేస్తారన్నారు.

ఈఈఎంటీకి దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

కొత్తచెరువు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఈఈఎంటీ-2026 పరీక్షకు విద్యార్థులు ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ క్రిష్ణప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ అనుమతితో ఎడ్యుకేషన్ ఏపీ ఫణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యందీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు అన్నారు. ఈ పరీక్ష రెండు దశల్లో ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థులకు రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు అందిస్తారన్నారు. ఏడో తరగతి విద్యార్థులకు వరుసగా రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు అందిస్తారని డీఈఓ తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా నగదు బహుమతులు ఉంటాయన్నారు. వివరాల కోసం జిల్లా సైన్సు అధికారి తనూజ్‌కుమార్ (సెల్ నంబర్.9492843184)ను సంప్రదించాలన్నారు.

12 దాకా ఈ పంట నమోదు

అనంతపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ పంట నమోదు గడువును ఈనెల 12 దాకా పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1901538 ఎకరాలకు (సాగు చేసిన పంట పొలాలు, బీడు పొలాలు)గాను ఇప్పటి దాకా 1740276 ఎకరాల్లో (92శాతం) ఈ పంట నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈనెల 8 దాకా ఈ పంట నమోదులో పెండింగ్‌లోని సర్వే నెంబర్లు అన్ని నమోదు చేయాలన్నారు. 9 నుంచి 12 దాకా సామాజిక తనిఖీలో భాగంగా జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు. సామాజిక తనిఖీలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించి, 13 తుది జాబితాను ప్రదర్శిస్తామన్నారు.

అవినీతే అభివృద్ధికి అడ్డంకి

విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అవినీతి.. దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పెద్ద అడ్డంకి అని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం పవర్ ఆఫీస్ ఆవరణలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఏపీటీఎస్ పోలీసు స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'నిజాయితీ ప్రమాణం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఈఈ జేవీ రమేష్, ఏపీటీఎస్ సీఐ విశ్వనాథ్ చౌదరి, ఏడీఈ రామకృష్ణ హాజరయ్యారు. ఎస్ఈ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ పనులను నిజాయితీగా చేయాలన్నారు. బాధ్యతగా చేయడం ద్వారా అవినీతి నిర్మూలించగలమన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది అవినీతి నిర్మూలనకు కట్టుబడి ఉంటామనీ, ప్రతి పనిలో నిజాయితీ, పారదర్శకత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది నాగన్న, విద్యుత్ శాఖ డీఈఈలు రఘు, రవిశంకర్, ఎస్టీఓ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ షేక్ రోషన్, విజిలెన్స్ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్


సాయి సారిష్

గుంతకల్లుటౌన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి సాయి సారిష్ చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించాడు. కర్నూలు పట్టణంలో అక్టోబరులో జరిగిన అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటాడు. రాపిడ్‌లో రేటింగ్ 1440, బ్లిట్జ్‌లో 1651 అత్యధిక రేటింగ్ సాధించి రికార్డ్ నెలకొల్పాడు. ఇతను దాదాపు రెండు సంవత్సరాలుగా కోచ్ అనిల్‌కుమార్, రామారావు వద్ద శిక్షణ పొందుతున్నట్లు తెలిపాడు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- పింఛన్ల పంపిణీలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

గార్లదిన్నె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని పాతకల్లూరు గ్రామంలో శనివారం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి పలువురు లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు మళ్లీ గాడిలో పెడుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పింఛన్లను భారీగా పెంచి వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు చేయూతనందిస్తున్నారని అన్నారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా ఒక్క కల్లూరు గ్రామంలోనే రూ 29 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, రూ. 28 లక్షల వ్యయంతో డ్రైనేజీ కాలువలు నిర్మించారని, రూ.10 లక్షల వ్యయంతో తాగునీటి సమస్య, రూ. 21 లక్షలతో విద్యుత్ సమస్య పరిష్కరించారని పేర్కొన్నారు. రూ.42 లక్షల వ్యయంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంజూరు చేసినట్లు వివరించారు. ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన సాగిస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శీనప్ప, చల్లా నాగరాజు, సామల మధు, రాజు, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కల్లూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

నువ్వో.. రాజకీయ వ్యాపారి

- 450 ఎకరాలు ఎలా సంపాదించావ్?
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతపై మండిపడ్డ ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి రాజకీయ వ్యాపారి అని, ఆయన రాజకీయాన్ని అడ్డం పెట్టుకుని జిల్లాకేంద్రం చుట్టుపక్కల సుమారు 450 ఎకరాల ఆస్తిని సంపాదించారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శించారు. నగరంలోని 39, 26, 8వ డివిజన్లలో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. తర్వాత 39వ డివిజన్‌లోని వడ్డే కాలనీ, 26వ డివిజన్‌లోని హమాలీ కాలనీలో రూ.70 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై ఫైర్ అయ్యారు. రాజకీయాన్నే వ్యాపారంగా మార్చుకుని అనంతపురం నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో 450 ఎకరాల భూమిని సంపాదించారని, దీనిబట్టి చూస్తుంటే ఆయన ఏస్థాయిలో అక్రమాలు చేశారో అర్థమవుతోందని అన్నారు. 20/1, 22/1, 50/2, 51/2, 26, 49/2, 35/2, 23/2బి, 49/1 సర్వే నంబర్లలో ఉన్న డీసీ ల్యాండ్స్ వారికి ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. సోదరులు సుబ్బారెడ్డి, చంద్రారెడ్డితో పాటు సోదరుడి భార్య మాలతి పేరున, ఆయన పేరున భూములు ఎక్కడివంటూ నిలదీశారు. చీకటి రాజకీయాలు తెలిసే ప్రజలు అనంతను ఇంట్లో కూర్చోబెట్టారని అన్నారు. వైసీపీ హయాంలో జిల్లాకు ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేకపోయారన్నారు. ఇప్పుడు కోటి సంతకాల సేకరణ పేరుతో ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం, తనపై విమర్శలు చేస్తే... నీ ఇంటి ముట్టడికి కూడా వెనకాడబోమని దగ్గుపాటి హెచ్చరించారు.

ఆ ఇంట్లో.. ఆరింతల ఆనందం

- ఒకే ఇంట్లో ఆరుగురికి పింఛన్
- ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి


పింఛన్ అందుకుంటున్న సయ్యద్ కుటుంబసభ్యులు

అనంతపురం క్రైం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఒకే ఇంట్లో ఆరుగురికి పింఛన్ అందుతుండటంపై ఆరింతల ఆనందం వ్యక్తమైంది. నగరంలోని హమాలీ కాలనీలో ఒకే ఇంట్లో ఆరుగురికి పింఛన్ రావడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాదద్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శనివారం జరిగిన పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే వెళ్లారు. లబ్ధిదారుడు సయ్యద్, అతని ఇద్దరు కుమారులు, ఇద్దరు కోడళ్లు, మనవడు మూగవారు కావడంతో వారికి ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున రూ.36 వేలు ఫింఛన్ అందుతోందని తెలుసుకుని ఎమ్మెల్యే ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేశారు. సయ్యద్ కుటుంబం ఉంటున్న ఇళ్లు వర్షానికి కారుతోందని తెలుసుకుని వెంటనే కొత్త ఇల్లు మంజూరు చేయాలని నగర కమిషనర్ బాలస్వామిని ఆదేశించారు.

క్రీడాపోటీల విజేతగా ఆర్ట్స్ కాలేజీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్శిటీ గ్రూప్-ఏ క్రీడా పోటీల విజేతగా ఆర్ట్స్ కాలేజీ జట్టు నిలిచింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల గ్రూప్- ఏ క్రీడా పోటీలను శనివారం స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లోలో విజేతగా నిలిచిన ఆర్ట్స్ కాలేజీ జట్టు టేబుల్‌టెన్నిస్, సాఫ్ట్ బాల్‌లో రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టు సభ్యులను ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, పీడీలు శ్రీరామ్, శత్రుఘ్న, నగేష్‌నాయక్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో పాండురంగడి నిజపాద దర్శనం


ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ సమేత పాండురంగస్వామి

అనంతపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ఏకదాశిని పురస్కరించుకుని రామ్‌నగర్‌లోగల పాండురంగ స్వామి ఆలయంలో శనివారం స్వామివారి నిజపాద దర్శనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఉత్సవ మూర్తులకు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం విశేష పూజలు చేసి భక్తుల చేత పాదస్పర్శ పూజ నిర్వహించారు. తర్వాత మహామంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భవసార క్షత్రియ సమాజ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్, ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పరిశోధనలపై చర్చ

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ రావిడే కిషోర్ నగరంలోని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్యను కలిశారు. శనివారం జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన జేఎన్‌టీయూ పరిపాలన భవనంలో వీసీ, రిజిస్ట్రార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జేఎన్‌టీయూఏలో సాగుతున్న పరిశోధనలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

టెట్‌ను ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయించాలి

అనంతపురం విద్య, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ పెట్టడం సరికాదని, ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి మినహాయింపునకు కృషి చేయాలని ప్యాప్టో చైర్మన్ శ్రీనివాస నాయక్ ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ నాయకులు, టీచర్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కోరారు. ఎంపీని వారు నగరంలోని నివాసంలో శనివారం కలిసి మాట్లాడారు. డీఎస్సీ రాసి క్వాలిఫై అయిన తర్వాతనే ఉపాధ్యాయులుగా ఎంపికయ్యామని, దశబ్ధాలుగా పని చేసిన తర్వాత ఇప్పుడు టెట్ రాసి పాస్‌కావాలనే నిబంధన పెట్టడం సరికాదన్నారు. దీనివల్ల ఆందోళన చెందుతున్నామన్నారు. వెంటనే కేంద్రప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి సుప్రీంకోర్టులో రిట్‌పిటీషన్ వేయించి సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇచ్చేలా చూడాలని కోరారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేపకుంటలో పింఛన్ల పంపిణీ


వేపకుంటలో పింఛను అందజేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి

కనగానపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపకుంట గ్రామంలో శనివారం రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్లు అందించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామాధ్యక్షుడు లింగన్న, తలారి చెంద్రాయుడు, రామలింగ, వెంకటప్ప, బొగ్గు నరసింహులు, రమేష్, వారాది, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు యువత శ్రమించాలి

- కలెక్టర్ ఆనంద్ పిలుపు



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేటి యువత పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛందంగా శ్రమించి ప్రజలలో పర్యావరణ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. కురుగుంటలో శనివారం ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ యూనిట్-2, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో పాల్గొనడం హర్షణీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను గ్రామాల్లోని ప్రజలకు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రత్యేక శిబిరం ద్వారా ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించడం మంచి విషయమన్నారు. అలాగే పర్యావరణ ప్రాముఖ్యత గురించి కూడా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఎంపీడీఓ దివాకర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, పీఆర్ జేఈ శేషయ్య, విద్యుత్ ఏఈ సోమశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్, హౌసింగ్ ఏఈ సంపత్, పంచాయతీ కార్యదర్శి సర్దార్ వలి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణు ప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

శింగనమల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.బండమీదపల్లిలో శనివారం డ్వామా పీడీసలీంబాషా పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ఉపాధి పనులు, పండ్లతోటల పెంపకం, గోకులంషెడ్లు,పశువులతొట్టెల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు కూలీల శాతం పెంచాలని, అడిగిన వెంటనే కూలీలకు పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈఓఆర్డీ విజయ్‌కుమార్, ఏపీఓ సౌభాగ్యలక్ష్మి, ఈసీ దామోదర్ టెక్నికల్ అసిస్టెంట్ సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

పాపంపేట భూముల పరిశీలన

అనంతపురం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాపంపేట భూములను నిజ నిర్ధారణ కమిటీ కన్వీనర్ సాకే హరి శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. 1964లో ఇక్కడి శోత్రియం భూములపై నెల్లూరు సెటిల్మెంట్ జరిగిందన్నారు. ఈ భూముల కబ్జాను అడ్డుకుంటామని తెలిపారు. భయాందోళనలో ఉన్న స్థానిక ప్రజలకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే భరోసా ఇచ్చి భద్రత కల్పించాలని కోరారు. కమిటీ సభ్యులు ఎంఎండీ ఇమామ్, అంజి, సురేష్‌యాదవ్, టీవీరెడ్డి, శంకర కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు శింగనమల చెరువులో తెప్పోత్సవం

శింగనమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): శింగనమల శ్రీరంగరాయని చెరువులో గ్రామ దేవతల తెప్పోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మత్స్యకారులు ప్రత్యేకంగా డమ్ములతో తెప్పను ఏర్పాటు చేశారన్నారు. ఈ తెప్పకు ప్రత్యేకంగా విద్యుత్ అలకరణ చేసి గ్రామదేవతల ప్రతిమలను కొలువు దీర్చి చెరువులో ఉత్సవం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరు కానున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని గ్రామపెద్దలతో పాటు దేవాదాయ అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు..

ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను, రెండు ట్రాక్టర్లను శింగనమల సీఐ కౌలుట్లయ్య సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. పామిడి పెన్నానది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అనంతపురం వైపు తరలిస్తున్న ఆ వాహనాలను పట్టుకున్నామని, అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఎవరైనా ఇసుక, ఎర్రమట్టి అనుమతి లేకుం డా తరలిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

- శింగనమల: మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి శింగనమల పోలీసుస్టేషన్‌కు తరలించారు. శనివారం తెల్లవారుజామున మండలంలో ఒక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై రెవెన్యూ అధికారుల, పోలీసులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె,నవంబరు1(ఆంధ్రజ్యోతి):మండలంలోని కేకే తండా సమీపంలో శనివారం ఆటోబోల్తా పడి ఇద్దరికి గాయాలైయ్యాయి. కేకే తండాకు చెందిన సునీతమ్మ, మహమ్మద్ ఆటోలో గార్లదిన్నెకు బయలుదేరారు. కేకే తండా దాటగానే ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో వారిద్దరికీ గాయాలైయ్యాయి. స్థానికులు 108వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

అనంతపురం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట పంచాయతీ అజయ్‌ఘోష్ కాలనీలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకి కులస్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి కులస్థులు రామాంజనేయులు, ఎర్రప్ప, అక్కులప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు


సీఎం చంద్రబాబుకు నమస్కరిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


పువ్వు ఇచ్చి స్వాగతం పలుకుతున్న అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, పక్కన శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


సీఎంతో నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, రాయల్ మురళి

అనంతపురం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును పలువురు ఎమ్మెల్యేలు కలిశారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నగారిపల్లికి పింఛన్ల పంపిణీ కోసం సీఎం శనివారం వచ్చారు. ఆయన్ను పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వేంకటేశ్వరప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, అనంతపురం నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, రాయల్ మురళి తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. తర్వాత అందరూ అక్కడ జరిగిన ప్రజావేదికలో పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

- అమరజీవి పొట్టిశ్రీరాములుకు పలువురి నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్కేయూ వీసీ అనిత తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరై అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం సుమారు 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్ ఆచార్య జీవీ రమణ, వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఆచార్య అంజనేయులు, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ శ్రీరాములు నాయక్ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

- అనంతపురం క్రైం: నగరంలోని క్లాక్‌టవర్ వద్ద ఉన్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వేరువేరుగా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆయన చేసిన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు పొట్లూరి హరికృష్ణ, నాయకులు రాజీవ్‌రెడ్డి, డిష్ నా గరాజు, సుధాకర్ యాదవ్, మోహన్‌కుమార్, రాజారావు, కృష్ణం రఘు, కురుబ నారాయణస్వామి బళ్లా రి గోపాల్, మచ్చా నరసింహులు, నాగభూషణం, రామ్మోహన్ చౌదరి, లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- అనంతపురం విద్య: అమరజీవి పొట్టిశ్రీరాములుకు గ్రంథాలయశాఖ ఉద్యోగులు ఘన నివాళులు అర్పించారు. నగరంలోని జిల్లాగ్రంథాలయశాఖలో ఆయన చిత్రపటానికి కార్యదర్శి రమ పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీలైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందు, ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి


వేపమొక్క నాటిన ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. మండలంలోని గంగంపల్లి వద్ద గల దుర్గమ్మ ఆలయ ఆవరణలో శనివారం ఎన్ఆర్‌జీఎస్, డ్వామా ఆధ్వర్యంలో 15ఎకరాల్లో 1500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని వేప, చింత, ఉసిరి తదితర మొక్కలను ఎమ్మెల్యే నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వదిలేయకుండా నిత్యం నీరు పోసి సంరక్షించాలని సూచించారు. వాటిని మనం రక్షిస్తే.. అవి మనల్ని రక్షిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నసనకోటలో పింఛన్ల పంపిణీ

మండలంలోని నసనకోటలో చేపట్టిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు, దివ్యాంగులు మోములో ఆనందం కనిపిస్తోందన్నారు. తమ పెద్ద కొడుకులా సీఎం చంద్రబాబు ప్రతినెలా రూ. 4 వేలు ఇస్తున్నారని వృద్ధులు అంటుంటే సంతోషంగా ఉందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం పింఛన్లు పెంచి ఇస్తున్నారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తామని తెలిపారు.

పగలే ఇసుక లోడింగ్

- సోషల్ మీడియాలో వైరల్


చిలేపల్లి వంకలో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను లోడింగ్ చేస్తున్న దృశ్యం

శింగనమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ రవాణా పట్టపగలే యథేచ్ఛగా సాగుతోంది. చిలేపల్లి కూతలేరు వంక ప్రాంతంలో శనివారం ఉదయం 10 గంటల సమయంలో కొందరు అక్రమార్కులు ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తోడి టిప్పర్లలో లోడింగ్ చేస్తున్నారు. దీనిని కొందరు స్థానికులు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ వైరల్ చేశారు. దీంతో అధికారులు మేలుకొని ఘటనా స్థలం వద్దకు హడావుడిగా వచ్చారు. అయితే అప్పటికే ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ వెళ్లిపోయాయి. ఇక అధికారులు అక్కడ ఎలాంటి ఇసుక తరలింపు జరగలేదంటూ వెనుదిరిగి వెళ్లిపోయారు. మండల వ్యాప్తంగా ఇసుక ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు, తరలింపులు భారీగా జరుగుతున్నాయి. ఇంతజరుగుతున్నా.. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్టు ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రిటైర్డ్ ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇతర బ్యాంకు ఉద్యోగుల తరహాలోనే కోటక్ మహీంద్ర బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని యునైటెడ్ ఫెడరేషన్ బ్యాంకు యూనియన్ కన్వీనర్ రుష్యేంద్ర బాబు డిమాండ్ చేశారు. స్థానిక సాయినగర్‌లోని గాయత్రి కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం కోటక్‌మహేంద్ర బ్యాంకు ఉద్యోగుల సమావేశం జరిగింది. ఇందులో రుష్యేంద్రబాబు పాల్గొని మాట్లాడారు. పెన్షనర్లకు బెనిఫిట్స్, ఎక్స్ గ్రేషియా చెల్లించకుండా కోటక్‌మహేంద్ర బ్యాంకు యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. మిగతా అన్ని ప్రైవేటు బ్యాంకులు పెన్షనర్లకు అన్ని రకాల సదుపాయా లు కల్పిస్తున్నప్పటికీ కోటక్ మహేంద్ర బ్యాంకు అలసత్వం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. డీఏతో పాటు బకాయి చెల్లించాలన్నారు. అంతేగాక ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. లేని పక్షంలో అన్ని బ్యాంకు ఉద్యోగులతో కలిసి దశల వారిగా ఆందోళలను చేపడుతామని హెచ్చరించారు. అనంతరం 75సంవత్సరాలు నిండిన విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కోటక్‌మహేంద్ర బ్యాంకు పెన్షనర్ల సంఘం నాయకులు చంద్రమోహన్ రెడ్డి, శివశంకర్, శివారెడ్డి, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం, టీచర్ గొడవపై సీరియస్

- విచారణకు ఆదేశించిన డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు జడ్పీఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఓ మహిళా టీచర్ గొడవ వ్యవహారంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వీరిద్దరు వివిధ కారణాలతో నిత్యం గొడవపడుతూ వస్తున్నారు. ఈ రగడ తారాస్థాయికి చేరడంతో ఇద్దరూ ఒకరిపైఒకరు రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. రాష్ట్రకమిషనర్ కార్యాలయం నుంచి డీఈఓకు ఫోన్ చేసి వజ్రకరూరులో అంత జరుగుతుంటే ఏమి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీరియస్‌గా ఆదేశాలు ఇచ్చారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు ఆ వ్యవహారంపై చర్యలకు ఉపక్రమించారు. వెంటనే విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. దీంతో వజ్రకరూరు గొడవ వ్యవహారం విద్యాశాఖవర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం: మంత్రి

పలుచోట్ల పింఛన్ల పంపిణీ


పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం


కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


పామిడిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

ఉరవకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో శనివారం మంత్రి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం గుంతకల్లు రోడ్డు నుంచి కణేకల్లు క్రాస్ వరకూ రూ.2.90 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు.

● రాయదుర్గంరూరల్: సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధికి బాటలు పరుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి అండగా ఉండాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ కొండన్న, పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి, ఏపీడీ రాజారావు, ఏపీఓ రవి, టీడీపీ నాయకులు హనుమంతు, వెంకటేశులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గం: టీడీపీ కార్యకర్తల సంక్షేమమే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని రాచప్పబావి వీధిలో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేశ్ ఈనెల 7 కళ్యాణదుర్గానికి వస్తున్నట్లు తెలిపారు. 8న కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని వివరించారు. రాచప్పబావి కాలనీకి చెందిన చేనేత కార్మికుడు రంగస్వామి కుటుంబానికి రూ.50 వేల నగదు సాయాన్ని ఎమ్మెల్యే అందచేశారు.

● పామిడి: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. పామిడిలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం కల్పించిందన్నారు.

● గుంతకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమానికి మారుపేరుగా నిలిచారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని రెండో వార్డులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మెహరున్నిసా, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, హనుమంతు, మత్రు నాయక్, చికెన్ జగన్, గుణ, ఫజులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

ఉరవకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో మంత్రి పయ్యావుల కేశవ్ సమీక్ష నిర్వహించారు. శనివారం కౌకుంట్లలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఉరవకొండలో తాగు నీరు, డ్రైనేజీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధుల వినియోగం, అమలవుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. సమావేశంలో ఎంపీడీవో రవి ప్రసాద్, పీఆర్ డీఏ రసూల్, డిప్యూటీ ఎంపీడీవో సతీష్, ఏపీవో సుజాత పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ ఇవ్వడమే ధ్యేయం : ఎమ్మెల్యే

గుంతకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు సరఫరా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. శనివారం కసాపురం రోడ్డులో నిర్మించిన 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. లోఓల్టేజీ సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మెహరున్నిసా బేగం, నాయకులు అంజి, యుగంధర్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం, టీచర్ గొడవపై విచారణ

అనంతపురం విద్య, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఓ మహిళా టీచర్ గొడవపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. వీరిద్దరు నిత్యం వివిధ కారణాలతో గొడవ పడుతున్నారు. ఒకరిపై ఒకరు రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయం నుంచి డీఈఓకు ఫోన్ చేసి ఆరాతీసినట్లు సమాచారం, వజ్రకరూరులో అంత జరుగుతుంటే ఏమి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీరియస్ గా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈనేపథ్యంలో వజ్రకరూరు గొడవ వ్యవహారం విద్యాశాఖవర్గాలలో తీవ్ర చర్చకు దారితీసింది.

రేషన్ షాపులపై అధికారుల దాడులు

గుంతకల్లుటౌన్,నవంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేషన్ షాపులపై తూనికల కొలతల శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. గుంతకల్లు, పామిడి పట్టణాలలో రెండు రేషన్ షాపులలో తూకాలలో మోసాన్ని గుర్తించి జరిమానా విధించారు. ఆంధ్రజ్యోతిలో శనివారం 'రేషన్ షాపుల్లో బహిరంగ దోపిడీ' అనే కథనం ప్రచురితమయింది. పట్టణంలోని రైల్వే కాలనీలోని షాపు నెంబర్ 3పై తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నిర్వాహకుడికి రూ.3వేలు జరిమాన విధించారు. పామిడి పట్టణంలోని ఎఫ్‌పీషాపు నెంబర్ 4లో తూకాల్లో మోసాన్ని గుర్తించి రూ. 5వేలు జరిమానా విధించారు.

మైనింగ్ ప్రాంతంలో కొనసాగిన సర్వే

డీ.హీరేహాళ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం మైనింగ్ ప్రాంతంలో సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ మూడోరోజు కొనసాగింది. శనివారం అంతరగంగ తదితర మైనింగ్ ప్రాంతాలలో అటవీ, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు బృందాలుగా సర్వే ప్రక్రియను కొనసాగించారు. కార్యక్రమంలో అధికారులు రూప్లానాయక్, గురుప్రభాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తాడిపత్రి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన పక్కీరమ్మ (58) అనే మహిళ శనివారం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని పట్టణ ఎస్‌ఐ గౌస్‌బాషా తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. కాటమయ్య, పక్కీరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. కాటమయ్య బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పక్కీరమ్మకు కొంతకాలంగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు సమస్యలపై పోరాడుదాం

కళ్యాణదుర్గం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై నిర్విరామంగా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు తెలిపారు. శనివారం పట్టణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడుదామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, నాయకులు చింతప్ప, రమేష్, రంగనాథ్, మారెన్న, వన్నూరుస్వామి, అల్లాబకాష్, తిప్పయ్య పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

తాడిపత్రి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.10, 700 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

రాయదుర్గం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ వెనుక రోడ్డు, వెంకటేశ్వర మాన్యంలో మురుగుకాలువ నిర్మాణాలకు రూ. 50 లక్షలతో శనివారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించారని, అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పొరాళు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, నాయకులు పురుషోత్తం, ప్రశాంతి, పద్మజ, హనుమంతు, వెంకటేశులు, కరెన్న పాల్గొన్నారు.